

వార్తల్లో మహిళ

# స్టాండప్.. స్టార్టప్!

**చండీగఢ్‌కి** చెందిన శశి ధీమన్ ఫార్మా రంగంలో పనిచేసేవారు. మనసు మాత్రం స్టాండప్ కామెడీ మీదే ఉండేది. చివరికి మనసు వైపే మొగ్గారు. స్టాండప్ కమెడియన్‌గా అయ్యారు. గత ఏడాది, ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరపున తాను చేసిన వీడియోలు బాగా వైరల్ అయ్యాయి. శశి సత్తా చాటాయి. ఆమెకు చిన్నప్పటి నుంచీ స్టేజ్ ఎక్కాలనే ఆరాటం ఎక్కువ. నలుగురినీ నవ్వించడం మహా ఇష్టం. ఆ తపనే స్టాండప్ కమెడియన్‌గా మార్చేసింది. శశి దృష్టిలో హాస్యం మనసు సేద తీర్చే మంత్రం. ఎన్నో ఒత్తిడుల మధ్య బతుకుతున్నవారికి కించిత్ ఉపశమనం ఇచ్చే మందు. అందుకే ప్రతి ప్రదర్శనా కొత్తగా ఉండాలని తపిస్తారామె. ప్రేక్షకుల నేపథ్యాల్ని బట్టి తన జోకులు, పంచులు మారిపోతూ ఉంటాయి. 'నేను ఏక వ్యక్తి స్టార్టప్‌లాంటి దాన్ని' అని నవ్వేస్తారు శశి. 'స్టాండప్ కామెడీ కత్తిమీద సామే. అలా అని దాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలి అనుకునేవారు వెనకడుగు వేయనవసరం లేదు' అని భరోసా ఇస్తారు. 'ఓ అయిదు నిమిషాలకు సరిపడా జోక్స్ రాసుకుని, మైక్ అందుకుని నిర్భయంగా ప్రదర్శన ఇచ్చేస్తే... అదే అలవాటైపోతుంది' అంటూ రేపటి స్టాండప్ కమెడియన్లకు గెలుపు చిట్కా చెబుతారు.



నమస్తే తెలంగాణ

# జిందగీ

II

హైదరాబాద్ | శనివారం 10 ఫిబ్రవరి 2024 www.ntnews.com


Fashion



• సమతా చౌదరి, డిజైనర్
wowobySamathachowdari

## మస్లిన్ గులాబీ

ఆకాశ నీలానికి అందమైన కలయిక ఏదంటే.. గులాబీ వన్నెకు మించింది మరోటి ఉంటుందా అంటుంది నారీ లోకం. నిజమే, ఆ రెంటి మేలు కలయికా ఎవర్‌గ్రీన్ కాంబినేషన్. మస్లిన్ వస్త్రంతో కుట్టిన గులాబీ వన్నె డ్రెస్‌కు డిజిటల్ ప్రింటెడ్ నీలి రంగు లెనిన్ దుపట్టాను జోడించారు డిజైనర్లు. మృదువుగా జాలువారే మస్లిన్ వస్త్రం మీద వచ్చిన ఇకత్ ప్రింట్ డ్రెస్‌కు సంప్రదాయ అందాన్ని ఆపాదిస్తే, చున్నీ మీద వచ్చిన డిజిటల్ ప్రింట్స్ కాంటెంపరరీ లుక్‌ను కట్టబెట్టాయి.



'అందరిలా ఉండలేను. అలా అని నా ఉనికిని ప్రశ్నార్థకం కానివ్వలేను. అందుకే, సాధారణ మార్వాడీ మహిళలకు భిన్నంగా వ్యాపారంలో అడుగుపెట్టాను. అక్కడితో ఆగిపోతాననే భయానికి తావులేకుండా... ఆత్మీయుల ప్రోత్సాహంతో 100 ఏండ్ల కుటుంబ వ్యాపారాన్ని విస్తరించడంపై దృష్టి పెట్టాను. అవసరమైన నైపుణ్యాలను పెంచుకుంటూ... ఎంతోమందిని ముత్యాలు, పగడాల నగల తయారీలో శిక్షణనిచ్చే స్థాయికి తీసుకొచ్చాను. సాదాసీదా జమాఖాతాలు చూసుకోవడంతో మొదలుపెట్టి.. మా సంస్థను ఖండాంతరాలకు విస్తరించాను' అంటూ తన విజయ గాథ వివరిస్తున్నారు సీకే పర్ల్స్ అండ్ జెమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిషా అగర్వాల్.

స్టార్టప్ స్టోరీస్

# పగడమంత ప్రతిభ

**సంప్రదాయ** మార్వాడీ కుటుంబంలో పుట్టాన్నేను. తరాలుగా మావారి కుటుంబానికి ముత్యాల వ్యాపారం ఉంది. కాకపోతే మా ఇండ్లలో కాలేజీ చదువుల వరకూ వెళ్లేవారు అతి తక్కువ. నాన్న చార్టర్డ్ అకౌంటెంట్ కావడంతో.. నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఉస్మానియా నుంచి ఎంబీఏ ఫైనాన్స్ చేశాను. అత్తగారింటికి వచ్చిన తర్వాత ఎంతో ఇష్టంగా వ్యాపారంలో అడుగుపెట్టాను. మా పుట్టింటికి పూర్తి భిన్నమైన కుటుంబ నేపథ్యం కావడంతో.. మొదట్లో ఇంటి దగ్గరే ఉండేదాన్ని. మావారి భరోసా బిజినెస్ వైపు దృష్టి పెట్టేలా చేసింది. నాలుగు తరాలుగా కొనసాగుతున్న ముత్యాలు, పగడాల ఆభరణాల వ్యాపారాన్ని దిగ్విజయంగా నడిపించే స్థాయికి తీసుకెళ్లింది. ఒకటిన్నర దశాబ్దంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. ప్రతి సమస్యలోనూ ఓ వ్యాపార అవకాశాన్ని వెదుక్కున్నాను.

### హైదరాబాద్ ముత్యాలు

గోల్కొండ సుల్తానుల కాలం నుంచీ ఇరాన్, ఇరాక్ వ్యాపారులే ముత్యాలు విక్రయించేవారు. ముత్యాలకు పుట్టినిల్లుగా చెప్పే బస్రా నుంచి వచ్చిన వర్తకులు... వాటిని ఏం చేయాలో తెలియక కుప్పలుగా పోసి అమ్మేవారు.

> సమాజం అన్నాక పరిమితులు ఉంటాయి. కుటుంబం అన్నాక సమస్యలూ ఉంటాయి. వాటిని అధిగమిస్తేనే.. ఏ మహిళ అయినా తన కలల్ని నిజం చేసుకుంటుంది. తన ఉనికిని నిరూపించుకుంటుంది. అదే సమయంలో కుటుంబ బాధ్యతల్ని, వ్యాపారాన్ని సమతౌల్యం చేసుకునే సామర్థ్యమూ పెంచుకోవాలి.
>
> • నిషా అగర్వాల్

మనవాళ్లు వాటికి మెరుగులద్ది, ఆభరణాలను తయారు చేసి మహారాణులకు, బేగం సాహిబాలకు అందించేవారు. అలా హైదరాబాద్‌కు ముత్యాలతో అనుబంధం ఏర్పడింది. ఇప్పటికీ హైదరాబాద్‌లో నాణ్యమైన ముత్యాలను విక్రయించే వర్తకులు ఎంతోమంది. నాసిరకం ముత్యాలతో మోసాలు చేసేవారు అంతకు రెట్టింపు ఉన్నారు. ఇలాంటి పనులే నగర ఖ్యాతిని మసకబారేలా చేస్తున్నాయి. రెడ్, సౌత్ సీ, కల్చర్, కేషీ వంటి సహజసిద్ధమైన ముత్యాలే నిఖార్సయినవి.

కానీ ఇటీవల కాలంలో, ఆల్చిప్పలను ప్రాసెస్ చేసి కృత్రిమ ముత్యాలు తయారు చేస్తున్నారు. వాటినే అమాయకులకు అంటగడుతున్నారు. కానీ, మా చంఘుమాల్-కేదారీనాథ్ (సీకే పర్ల్స్ అండ్ జెమ్స్) మాత్రం తరాలుగా విలువలతో కూడిన వ్యాపారం చేస్తున్నది. గతంలో బంగారానికి, ముత్యాల ఆభరణాలకు అపారఆదరణ ఉండేది. అయితే, పెరుగుతున్న బంగారం ధరల కారణంగా కరోనా తర్వాత ముత్యాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అప్పటి నుంచీ కేవలం ముత్యాలతో చేసిన ఆభరణాలను కూడా మగువలు ఇష్టపడుతున్నారు. అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడం, జపాన్, హాంకాంగ్, చైనా, వియత్నాం వంటి దేశాల్లో ఉత్పత్తి పడిపోవడంతో ముత్యాల ధరలు కూడా పెరుగుతున్నాయి.

### విస్తరణపై దృష్టి..

ఐఐఎం- బెంగళూరు ఉమెన్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు హాజరైన తర్వాత వ్యాపార విస్తరణపై మరింత దృష్టిసారించాను. శతాబ్దాలుగా ముత్యాల వ్యాపారానికి కేంద్రంగా ఉన్న చార్మినార్ నుంచి ఐటీ కారిడార్ వైపు విస్తరిస్తున్నాం. ఈ కామర్స్‌పైనా దృష్టి పెట్టాం. అయితే ఈ రంగంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. ఆ సమస్యకు పరిష్కారంగానే కాదు, మహిళల ఆర్థిక స్వేచ్ఛను ప్రోత్సహిస్తూ.. జువెలరీ డిజైనింగ్‌తో పాటు, రత్నాభరణాల తయారీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నా. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్రను పోషిస్తున్న కొవే (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్స్) - తరఫున ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించే ఆలోచనా ఉంది.

కడార్ల కిరణ్











# ఒంటరినైపోయాను..

నేను ఇంటర్ చదువుతున్నా. వయసు పదిహేడు. క్లాస్‌లో యాభైమంది ఉన్నా.. ఓ ఐదుగురం క్లోజ్‌గా ఉంటాం. కానీ గత నాలుగైదు నెలల నుంచీ మా బృందంలో మునుపటి హుషారు తగ్గింది. కలుసుకోవడమూ తక్కువే. ఐఐటీ కోచింగ్ అని ఒకరు, ఆన్‌లైన్ ట్యూషన్స్ అని ఒకరు దూరమైపోతున్నారు. నాకు చాలా వెలితిగా అనిపిస్తున్నది. కొత్తవాళ్లతో స్నేహం చేయాలంటేనేమో బెరుకు. చదువు మీద శ్రద్ధ పెట్టలేకపోతున్నా. మీరే సలహా ఇవ్వాలి.

• ఓ పాఠకురాలు

**జీవితం** ఓ ప్రవాహం లాంటిది. ఎన్నో మజిలీలు. ప్రతి మజిలీలో కొత్తగా కొందరు స్నేహితులు అవుతారు. రకరకాల కారణాలతో పాత స్నేహితులు దూరం అవుతారు. ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. ఎలిమెంటరీ స్కూల్ స్నేహితులు, హైస్కూల్ స్నేహితులు, కాలేజీ స్నేహితులు.. ఇలా ఓ జాబితా రాసుకోండి. మొదటి జాబితాకు, రెండో జాబితాకు పొంతనే ఉండదు. మూడో జాబితా మరింత కొత్తగా కనిపిస్తుంది. కాబట్టి, అనివార్య పరిస్థితుల్లో దూరమైపోయే దోస్తుల గురించి ఆలోచించొద్దు. అయినా, రోజూ కలుసుకొని కబుర్లు చెప్పుకోవడమే స్నేహానికి కొలమానం కాదు. వీలైతే వారానికోసారి, లేకపోతే నెలకోసారి మీట్ కావచ్చు. ఆన్‌లైన్ కబుర్లు ఎలాగూ ఉంటాయి. కొత్త స్నేహాల విషయంలో మొహమాటం వద్దు. ఆఫ్‌లైన్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపడానికి ఒక్క చిరునవ్వు చాలు. అదే సమయంలో చదువుల మీదా ఫోకస్ చేయండి.

డియర్ జిందగీ



# రొట్టె విరిగి నేతిలో..

**అది** కర్ణాటకలోని గజేంద్రగఢ్ తాలూకా. అక్కడి గ్రామీణ మహిళలు చిన్నచిన్న పనుల ద్వారా ఉపాధిని పొందుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. కానీ, కొవిడ్ తర్వాత పనులు తగ్గిపోయాయి. అలాంటి సమయంలో ఓ అవకాశం తలుపుతట్టింది. 'సంజీవని' అనే పథకం ద్వారా జొన్నరొట్టెలు తయారుచేసి అమ్మేందుకు నిధులు అందించారు అధికారులు. కానీ మహిళలే సంశయించారు. నష్టం వస్తుందేమో అని భయపడ్డారు. మొత్తానికి ఒకరి తర్వాత ఒకరు ఆమోదం తెలిపారు. ప్రభుత్వం అందించిన పెట్టుబడితో చిన్న పిండిమర సమకూర్చుకున్నారు. జొన్నల్ని టోకున చవకగా కొని.. మర ఆడించి.. ఆ పిండితో రొట్టెలు చేసి విక్రయించడం. ఇదీ వారి వ్యాపారం. ఎనిమిది నుంచి పది మంది వరకు ఓ బృందంగా పని మొదలుపెట్టారు. ఇలా, గజేంద్రగఢ్ తలూకాలోని వందలాది మహిళలు రొట్టెల తయారీతో ఆదాయం పొందుతున్నారు. ఒకప్పుడు నెలకు పదివేలు రావడమే గగనం. ప్రస్తుతం ఒక్కో బృందం రోజుకు పదివేల రూపాయలు కళ్ల జూస్తున్నది. చుట్టుపక్కలే కాకుండా, బెంగళూరులాంటి సుదూర ప్రాంతాలకు సైతం జొన్నరొట్టెలు సరఫరా చేస్తున్నారు.



# కొబ్బరి బూరెలు

### కావలసిన పదార్థాలు

**బియ్యం:** రెండు కప్పులు, **పచ్చికొబ్బరి:** అర కప్పు, **బెల్లం:** ఒకటిన్నర కప్పు, **నువ్వులు:** పావు కప్పు, **వంటసోడా:** అర టీస్పూన్, **యాలకుల పొడి:** ఒక టీస్పూన్, **నూనె:** వేయించడానికి సరిపడా.

### తయారీ విధానం

ముందుగా బియ్యాన్ని బాగా కడిగి రోజంతా నాన బెట్టాలి. నీళ్లు వంపిన బియ్యాన్ని ఆరబెట్టి పిండి పట్టుకుని జల్లించాలి. మందపాటి గిన్నెలో బెల్లం ముదురుపాకం పట్టుకోవాలి. తర్వాత ఆ గిన్నెను దింపి యాలకుల పొడి, వంటసోడా, నువ్వులు, పచ్చికొబ్బరి వేసి కొద్దికొద్దిగా పిండి వేస్తూ బాగా కలపాలి. పిండి ఆరిపోకుండా మూతపెట్టి కొంచెం కొంచెం తీసుకుంటూ బూరెలు ఒత్తుకోవాలి. వాటిని వేడివేడి నూనెలో కాల్చుకుంటే నోరూరించే కొబ్బరి బూరెలు సిద్ధం.



# రోజ్ రోజ్.. రోజ్ వాటర్!

రోజ్ వాటర్ మనకు కొత్తేమీ కాదు. వెయ్యేండ్ల క్రితమే వాడుకలో ఉన్నట్టు దాఖలాలు కనిపిస్తాయి. రోజ్ వాటర్‌తో ఎన్నో ప్రయోజనాలు. వాటిలో కొన్ని..




- రోజ్ వాటర్‌తో సహజమైన ఫేస్ ప్యాక్స్ తయారు చేసుకోవచ్చు. అలోవెరా జెల్ లేదా తేనె కలిపిన రోజ్ వాటర్ మిశ్రమాన్ని ఓ పది, పదిహేను నిమిషాలు మొహానికి పట్టించి గోరువెచ్చని నీటితో కడిగేస్తే చర్మం శుభ్రమవ్వడమే కాకుండా కాంతిమంతంగా మారుతుంది.
- రోజ్ వాటర్‌లో వాపును తగ్గించే యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు, సూక్ష్మక్రిములను చంపే యాంటీ మైక్రోబియల్ గుణాలు అపారం. ఇవి చర్మానికి సోకే ఇన్ఫెక్షన్లు, మొటిమలకు విరుగుడుగా పనిచేస్తాయి.
- రోజంతా ఎంత ఒత్తిడి ఉన్నా, సాయంవేళ రోజ్ వాటర్‌తో అరోమాథెరపీ చేస్తే... ఉపశమనం తథ్యం. రోజ్ వాటర్ సువాసన వల్ల మనసుకు హాయిగా అనిపిస్తుంది.
- సూర్యరశ్మి వల్ల కమిలిన చర్మానికి రోజ్ వాటర్ కొత్త జీవం పోస్తుంది. మంటను తగ్గించి, చర్మం ఆరోగ్యంగా మారేందుకు సాయపడుతుంది.
- చర్మానికి తేమను అందిస్తుంది. ఆ సువాసన మంచి అనుభూతిని కలిగిస్తుంది. చల్లని నీటితో మొహం కడుక్కుని రోజ్ వాటర్‌లో ముంచిన దూదితో అద్దుకుంటే, ఎంత ఉపశమనంగా అనిపిస్తుందో.. ఒక్కసారి ప్రయత్నిస్తే మీకే తెలుస్తుంది.

